# ఇండియన్ పాలిటీ

## భారతదేశంలో పార్లమెంటరీ కమిటీలు

ప్రజాస్వామ్యంలో ప్రజాభిప్రాయానికి ప్రతిబింబం పార్లమెంటరీ కార్యనిర్వాహక వర్గం. దీని నియంత్రణ, మెరుగైన శాసన నిర్మాణానికి పార్లమెంటరీ కమిటీల అవసరం ఎంతో ఉంది. ప్రజాధనం దుర్వినియోగం కాకుండా చూడటం, సంస్కరణలను సూచించడం తదితర కార్యకలాపాలను ఈ కమిటీలు నిర్వహిస్తాయి. బిల్లుల సంఖ్య పెరిగి వాటి రూపకల్పన సంక్లిష్టంగా మారడంతో, పార్లమెంటు సమావేశమయ్యే కాలం తగ్గిపోవడంతో కమిటీల ప్రాధాన్యం మరింత పెరిగింది. కాబట్టి వివిధ పోటీ పరీక్షల్లో ఈ విభాగం నుంచి ప్రశ్నలు వచ్చే అవకాశం ఉంది.

**పార్లమెంటరీ కమిటీ:** లోక్‌సభ లేదా రాజ్యసభ లేదా పార్లమెంటు ఎన్నుకున్న లోక్‌సభ స్పీకర్ లేదా రాజ్యసభ అధ్యక్షుడు నియమించిన కొద్దిమంది నిపుణులైన పార్లమెంటు సభ్యులతోకూడిన సంఘం లేదా కమిటీని పార్లమెంటరీ కమిటీ అంటారు. నైష్పత్తిక ప్రాతినిధ్య విధానంలో ప్రతి పార్టీకి పార్లమెంటులో ఉన్న సంఖ్యాబలం ఆధారంగా కమిటీల్లో ప్రాతినిధ్యం లభిస్తుంది. ప్రతి కమిటీ తమ నివేదికను స్పీకర్ లేదా రాజ్యసభ అధ్యక్షుడికి సమర్పిస్తుంది. కమిటీలు సమావేశం కావడానికి 1/3వ వంతు కోరం అవసరం.

**కమిటీల్లో రకాలు:** పార్లమెంటరీ కమిటీలు ప్రధానంగా రెండు రకాలు.

I. తాత్కాలిక కమిటీలు (Ad hoc Committees)

II. శాశ్వత కమిటీలు (Standing Committees)

**తాత్కాలిక కమిటీలు:** అవసరానికి అనుగుణంగా తాత్కాలికంగా వాటికి కేటాయించిన పనిని పూర్తిచేసే వరకు కొనసాగే కమిటీలు.

ఇవి రెండు రకాలు:

1. బిల్లులను పరిశీలించడానికి నియమించే సెలక్ట్ కమిటీ లేదా జాయింట్ కమిటీలు
2. దర్యాప్తు సంఘాలు లేదా విచారణ కమిటీలు

**శాశ్వత కమిటీలు:** వీటినే స్థాయీ సంఘాలు అని కూడా అంటారు. కమిటీల సభ్యులు మారుతూ ఉన్నప్పటికీ ఇవి నిరంతరంగా కొనసాగుతూ ఉంటాయి. వీటిని ప్రధానంగా ఆరు రకాలుగా వర్గీకరించవచ్చు.

**1.** **విత్త కమిటీలు:** ఇవి ఆర్థిక వ్యవహారాల్లో పార్లమెంటు నియంత్రణ కోసం ఏర్పరచినవి. ప్రభుత్వ ఖాతాల సంఘం, అంచనాల సంఘం, ప్రభుత్వరంగ సంఘం అనే మూడు విత్త కమిటీలు ఉన్నాయి. ఇవి నిరంతరం కొనసాగుతూ ఉంటాయి. సభ్యుల కాలపరిమితి సంవత్సరం. వీరిని నైష్పత్తిక ప్రాతినిధ్య విధానం ద్వారా ఎన్నుకుంటారు. మంత్రులు సభ్యులుగా ఉండకూడదు. లోక్‌సభ స్పీకర్ ఈ కమిటీలకు ఛైర్మన్‌ను నియమిస్తారు.

**a.** **ప్రభుత్వ ఖాతాల సంఘం:** ఇది అతి ప్రాచీన ఆర్థిక కమిటీ. దీన్ని 1921లో ఏర్పాటు చేశారు. సభ్యుల సంఖ్య 22 (15 లోక్‌సభ, 7 రాజ్యసభ). సాధారణంగా అధికార పార్టీకి చెందిన సభ్యుడు ఈ కమిటీ ఛైర్మన్‌గా ఉండేవారు. 1967 నుంచి కమిటీలోని లోక్‌సభలో ప్రతిపక్ష పార్టీకి చెందిన సభ్యుడిని ఛైర్మన్‌గా నియమిస్తున్నారు. ప్రస్తుత ఛైర్మన్ మల్లికార్జున్ ఖర్గే. కాగ్ (కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్) నివేదికను పరిశీలించడం ప్రభుత్వ ఖాతాల సంఘం ప్రధాన విధి.

**b.** **అంచనాల కమిటీ:** ఈ కమిటీని 1950లో ఏర్పాటు చేశారు. ఇందులోని సభ్యుల సంఖ్య 30. వీరందరినీ లోక్‌సభ నుంచి ఎన్నుకుంటారు. వార్షిక బడ్జెట్ అంచనాలను పరిశీలించడం, ప్రభుత్వ వ్యయంలో పొదుపును పాటించే పద్ధతులను సూచించడం, అంచనాలను ఏ రూపంలో పార్లమెంటుకు సమర్పించాలో సూచించడం ద్వారా ప్రభుత్వ విధానాల్లో తీసుకురావలసిన మార్పులను సూచిస్తుంది.

**c.** **ప్రభుత్వరంగ సంస్థల సంఘం:** ప్రణాళికాబద్ధమైన ఆర్థిక వ్యవస్థలో భాగంగా ప్రభుత్వ రంగ సంస్థలను సమర్థంగా నిర్వహించడం కోసం దీన్ని 1964లో ఏర్పాటుచేశారు. కమిటీలోని సభ్యుల సంఖ్య 22. ప్రభుత్వ రంగంలోని సంస్థల నివేదికలను, ఖాతాలను, ప్రభుత్వరంగ సంస్థలపై కాగ్ నివేదికను పరిశీలించడం మొదలైన విధులను నిర్వహిస్తుంది.



R-27-8-18

**2. వివిధ శాఖలకు సంబంధించిన స్థాయీ సంఘాలు:**

లోక్‌సభకు చెందిన నిబంధనల కమిటీ సిఫారసుల ఆధారంగా 1993లో 17 స్థాయీ సంఘాలను, 2004లో మరో 7 స్థాయీ సంఘాలను ఏర్పాటు చేయడంతో ప్రస్తుతం వీటి సంఖ్య 24కు చేరింది.

పార్లమెంటులో వివిధ పార్టీల సంఖ్యాబలం ఆధారంగా నైష్పత్తిక ప్రాతినిధ్య విధానంలో కమిటీల్లో సభ్యత్వం లభిస్తుంది. సభ్యుల పదవీకాలం సంవత్సరం. ప్రతిస్థాయీ సంఘంలోనూ 31 మంది సభ్యులు ఉంటారు.

24 శాఖాపరమైన స్థాయీ సంఘాల్లో 16 లోక్‌సభ ఆధ్వర్యంలో, 8 రాజ్యసభ ఆధ్వర్యంలోను పనిచేస్తాయి. లోక్‌సభ ఆధ్వర్యంలో పనిచేసేవి... వ్యవసాయంపై స్థాయీ సంఘం, సాంకేతిక సమాచార స్థాయీ సంఘం, రక్షణ సంఘం, శక్తి వనరులు, విదేశీ వ్యవహారాలు, ఆర్థిక వ్యవహారాలు, ఆహారం, వినియోగదారులు, ప్రజా పంపిణీ, శ్రామికుల వ్యవహారాలు, పెట్రోలియం, సహజవాయువు, రైల్వేలు, పట్టణాభివృది, గ్రామీణాభివృది, నీటివనరులు, రసాయనాలు, ఎరువులు, బొగ్గు, ఉక్కు, సామాజిక న్యాయం, సాధికారతా సంఘం.

రాజ్యసభ ఆధ్వర్యంలో పనిచేసే స్థాయీ సంఘాలు... వాణిజ్యం, ఆరోగ్యం, కుటుంబ సంక్షేమం, హోం మంత్రిత్వ వ్యవహారాలు, మానవ వనరుల అభివృద్ధి పరిశ్రమలు, సిబ్బంది, ప్రజాసమస్యలు, చట్టాలు, న్యాయం, శాస్త్ర, సాంకేతిక రంగం, పర్యావరణం, అడవులు, రవాణా, పర్యాటక, సాంస్కృతిక స్థాయీ సంఘం.

**3. దర్యాప్తు లేదా విచారణా సంఘాలు:**

**a.** **విజ్ఞాపన కమిటీ:** ఇది ప్రజా ప్రాధాన్యం ఉన్న ప్రభుత్వ వ్యహారాలు, పార్లమెంటుకు శాసనాధికారం ఉన్న అంశాలపై ప్రజల నుంచి వచ్చిన విజ్ఞాపనలను పరిశీలించి వాటిని ఏ విధంగా పరిష్కరించాలో సూచిస్తుంది. దీన్నే నిఘా కమిటీ అని కూడా అంటారు. దీన్ని 1933 లోనే ఏర్పాటు చేశారు. ఇది లోక్‌సభ, రాజ్యసభలకు విడివిడిగా ఉంటుంది. లోక్‌సభ అధీనంలోని కమిటీలో 15 మంది, రాజ్యసభకు చెందిన కమిటీలో 10 మంది సభ్యులు ఉంటారు.

**b.** **సభాహక్కుల సంఘం:** పార్లమెంటులో సభ్యుల ప్రవర్తన సభా గౌరవాలకు భంగం కలిగే విధంగా ఉంటే వారిపై తీసుకోవాల్సిన చర్యలను ఈ కమిటీ సూచిస్తుంది. దీని విధులు అర్ధ న్యాయ స్వభావమైనవి. లోక్‌సభకు చెందిన కమిటీలో 15 మంది, రాజ్యసభ కమిటీలో 10 మంది సభ్యులు ఉంటారు.

**c.** **నైతిక సంఘం:** పార్లమెంటులో సభ్యుల అనైతిక ప్రవర్తనకు సంబంధించిన వ్యవహారాల్లో తీసుకోవలసిన చర్యలను సూచిస్తుంది. ఈ కమిటీని రాజ్యసభలో 1997, లోక్‌సభలో 2000లో ఏర్పాటుచేశారు. రాజ్యసభలోని నైతిక సంఘ ఛైర్మన్ నారాయణ్ లాల్ పంచారియా.

**4. తనిఖీ సంఘాలు:**

**a.** **ప్రభుత్వ హామీల సంఘం:** పార్లమెంటులో మంత్రివర్గం ఇచ్చిన హామీలను ఎంతవరకు అమలుచేశారో పరిశీలిస్తుంది. ఈ కమిటీలో మంత్రులకు సభ్యత్వం ఉండదు. ఈ కమిటీ లోక్‌సభకు, రాజ్యసభకు విడివిడిగా ఉంటుంది. లోక్‌సభకు చెందిన కమిటీలో 15మంది సభ్యులు ఉంటారు. వీరిని లోక్‌సభ స్పీకర్ నియమిస్తారు. వీరి పదవీకాలం సంవత్సరం లేదా నూతన కమిటీని నియమించే వరకు కొనసాగుతుంది. ప్రస్తుతం ఈ కమిటీకి డాక్టర్ రమేష్ పోఖ్రియాల్ నిషాంక్ ఛైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. అదేవిధంగా రాజ్యసభకు చెందిన కమిటీలో 10 మంది సభ్యులు ఉంటారు. వీరిని రాజ్యసభ ఛైర్మన్ నియమిస్తారు. ప్రస్తుతం ఈ కమిటీకి ఎ. నవనీతకృష్ణన్ ఛైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు.

**b.** **దత్త శాసనాల సంఘం:** దత్త శాసనాధికారాన్ని ప్రభుత్వం ఏ విధంగా వినియోగిస్తుందనే విషయాన్ని పరిశీలిస్తుంది. ఈ కమిటీలు లోక్‌సభ, రాజ్యసభలకు విడివిడిగా ఉంటాయి. రెండు కమిటీల్లోను 15 మంది సభ్యులు ఉంటారు.

**c.** **పార్లమెంటుకు సమర్పించే పత్రాలు, నివేదికలపై సంఘం:** పార్లమెంటులో మంత్రివర్గం ప్రతిపాదించే పత్రాలు లేదా ప్రతిపాదనలు రాజ్యాంగబద్ధంగా ఉన్నదీ లేనిదీ ఈ కమిటీ పరిశీలిస్తుంది. దీన్ని 1975లో ఏర్పాటు చేశారు. ఇది లోక్‌సభకు, రాజ్యసభకు విడివిడిగా ఉంటుంది. లోక్‌సభకు చెందిన కమిటీలో 15 మంది, రాజ్యసభకు చెందిన కమొటీలో 10 మంది సభ్యులు ఉంటారు.

**d.** **షెడ్యూల్డ్ కులాలు, తెగల సంక్షేమ సంఘం:** జాతీయ షెడ్యూల్డ్ కులాల సంఘం, జాతీయ షెడ్యూల్డ్ తెగల సంఘాల నివేదికలను పరిశీలించడం, ఆయా వర్గాల రాజ్యాంగ, చట్టబద్ధ రక్షణలు, సంక్షేమ కార్యక్రమాల అమలును ఈ కమిటీ పరిశీలిస్తుంది. ఇది ఉభయ సభల సంయుక్త సంఘం. ఈ కమిటీలో 30 మంది సభ్యులు ఉంటారు.

e. **మహిళా సాధికారత సంఘం:** మహిళా సాధికారత కోసం ప్రభుత్వం అమలుచేస్తోన్న కార్యక్రమాలు, కృషి, జాతీయ మహిళా కమిషన్ నివేదికలను ఈ కమిటీ పరిశీలిస్తుంది. ఇందులో 30 మంది సభ్యులు (20 మంది లోక్‌సభ, 10 మంది రాజ్యసభ) ఉంటారు. రాజ్యసభకు చెందిన బిజోయ్ చక్రవర్తి ప్రస్తుతం ఈ కమిటీ ఛైర్మన్.

f. **లాభదాయకమైన పదవులపై సంయుక్త సంఘం:** లాభదాయక పదవులు, సభ్యుల అనర్హతలు (ఏక కాలంలో రెండు సభల్లో సభ్యత్వం మొదలైన అంశాలను ఈ కమిటీ పరిశీలిస్తుంది. ఇందులో 15 మంది సభ్యులు (లోక్‌సభ–10, రాజ్యసభ–5) ఉంటారు. ప్రస్తుతం లోక్‌సభకు చెందిన డాక్టర్ సత్యపాల్ సింగ్ ఈ కమిటీ ఛైర్మన్.

5. **సభా సంఘాలు:**

a. **సభా కార్యకలాపాల సలహా సంఘం:** పబ్లిక్ బిల్లులు, ఇతర కార్యకలాపాలకు దేనికి ఎంత సమయం కేటాయించాలో ఈ కమిటీ నిర్ణయిస్తుంది. ఇది లోక్‌సభ, రాజ్యసభలకు విడివిడిగా ఉంటుంది. లోక్‌సభలో 15 మంది, రాజ్యసభలో 11 మంది ఈ కమిటీల్లో సభ్యులుగా ఉంటారు. లోక్‌సభలో స్పీకర్ (సుమిత్రా మహాజన్, రాస్యసభలో ఛైర్మన్ (ఎం.వెంకయ్య నాయుడు) ఈ కమిటీలకు అధ్యక్షులుగా వ్యవహరిస్తారు.

b. **ప్రైవేట్ సభ్యుల బిల్లులు, తీర్మానాలపై సంఘం:** మంత్రివర్గంలో సభ్యుడుకాని ఇతర పార్లమెంటు సభ్యులు ప్రవేశపెట్టిన బిల్లులు, తీర్మానాలకు సభలో కేటాయించాల్సిన సమయాన్ని నిర్ణయించడం, బిల్లులను వర్గీకరించడం ఈ కమిటీ బాధ్యత. ఈ కమిటీ లోక్‌సభకు మాత్రమే ప్రత్యేకం. ఇందులో 15 మంది సభ్యులు ఉంటారు.

c. **నిబంధనల కమిటీ:** సభా వ్యవహారాలకు సంబంధించి నియమ నిబంధనల్లో అవసరమైన మార్పులను సూచించడం ఈ కమిటీ ప్రధాన విధి. లోక్‌సభకు చెందిన కమిటీలో 15 మంది సభ్యులు ఉంటారు. ఈ కమిటీకి స్పీకర్ అధ్యక్షత వహిస్తారు. రాజ్యసభకు చెందిన నిబంధనల కమిటీలో 16 మంది సభ్యులు ఉంటారు. ఈ కమిటీకి ఛైర్మన్ అధ్యక్షత వహిస్తారు.

d. **సభ్యుల గైర్హాజరుపై సంఘం:** లోక్‌సభ సభ్యుల సెలవు దరఖాస్తులు, అనుమతి పత్రాలను పరిశీలించడం, స్పీకర్ అనుమతి లేకుండా వరుసగా 60 రోజులపాటు సభకు హాజరుకాకపోతే అలాంటి కేసులను విచారించి తగిన సూచనలు చేస్తుంది. ఇది కేవలం లోక్‌సభకు మాత్రమే సంబంధించింది.

6. సేవా సంఘాలు

a. **సాధారణ ప్రయోజనాల సంఘం:** సభా కార్యకలాపాలకు సంబంధించి ఏ పార్లమెంటు కమిటీ పరిధిలోకిరాని అంశాలపై సలహాలిస్తుంది. లోక్‌సభలో స్పీకర్, రాజ్యసభలో ఛైర్మన్ ఈ కమిటీకి అధ్యక్షత వహిస్తారు.

b. **గ్రంథాలయ సంఘం:** పార్లమెంటులోని గ్రంథాలయం, పార్లమెంటు సభ్యులు గ్రంథాలయ సేవలను పొందడానికి అవసరమైన విషయాలను పరిశీలిస్తుంది. ఇది 9 మంది సభ్యులతో (లోక్‌సభ నుంచి 6, రాజ్యసభ నుంచి 3 మంది) కూడిన సంయుక్త సంఘం.

c. **సభ్యుల జీతభత్యాలపై సంఘం:** పార్లమెంటు సభ్యుల వేతనాలు, భత్యాలు, పెన్షన్ మొదలైన విషయాలపై అవసరమైన నియమాలను రూపొందిస్తుంది. కమిటీలోని సభ్యులే కమిటీ అధ్యక్షుడిని ఎన్నుకునే ఏకైక పార్లమెంటరీ సంఘం. 15 మంది సభ్యులున్న సంయుక్త సంఘం. (లోక్‌సభ–10, రాజ్యసభ–5).

d. **సభా సంఘం:** పార్లమెంటు సభ్యుల గృహ వసతి, ఆహారం, వైద్యం మొదలైన విషయాలపై సలహాలిస్తుంది.

**రచయిత: ఎం. భాస్కర్‌రాజు**